

న్యాయమూర్తి అరుణను సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

న్యాయమూర్తి అరుణకు ఘనంగా వీడ్కోలు

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 29: కరీంనగర్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం అరుణ హైదరాబాద్‌కు బదిలీ అయిన సందర్భంగా ఆమెకు వీడ్కోలు, కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్‌కు స్వాగత కార్యక్రమాన్ని సోమవారం కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలోని మీడియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి బీ ప్రతిమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భార్యాభర్తల విడాకుల కేసుల్లో జడ్జి అరుణ చూపిన చొరవను కొనియాడారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జడ్జి వెంకటేశ్ కేసుల పరిష్కారంలో ఎక్కువ చొరవ చూపాలని సూచించారు. బదిలీపై వెళ్తున్న జడ్జి అరుణ మాట్లాడుతూ, ఇక్కడి న్యాయవాదులు, జిల్లా జడ్జి ఇతర న్యాయ మూర్తుల సహకారం మర్చిపోలేనిదన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు రఘువీర్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి ఇతర కార్యవర్గ సభ్యులు జడ్జి వెంకటేశ్‌కు స్వాగతం పలుకుతూ సన్మానించారు. జడ్జి అరుణను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ఓటు హక్కు విధిగా వినియోగించుకోవాలి

- 13న పోలింగ్‌లో పాల్గొని విజయవంతం చేయాలి
- నగరపాలక కమిషనర్ శ్రీనివాస్

కలెక్టరేట్, ఏప్రిల్ 29: నగరంలోని ట్రాన్స్ జెండర్లు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని నగరపాలక కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. ఓటరు చైతన్య కార్యక్రమాల్లో భాగంగా స్వీప్ ఆధ్వర్యంలో సోమవారం మెప్మా సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని మంచిర్యాల చౌరస్తా, సుభాష్ నగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం థర్డ్ జెండర్లను గుర్తించి ఓటు హక్కు కల్పించిందన్నారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని, దీనిని గమనించి థర్డ్ జెండర్లు మే 13న జరిగే పోలింగ్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే అభ్యర్థులు, రాజకీయ పార్టీలపై కూడా సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. మెప్మా సిబ్బంది అనిత, సునీత శ్రీవాణి, శ్రీవాని, 30 మందికి పైగా థర్డ్ జెండర్లు పాల్గొన్నారు.

రెండో విడుత దళిత బంధు డబ్బులు విడుదల చేయాలి

- జమ్మికుంట సభలో ముఖ్యమంత్రి ప్రకటించాలి
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 29: జమ్మికుంటలో నేడు జరిగే బహిరంగ సభకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండో విడుత దళిత బంధు డబ్బులను విడుదల చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల అకౌంట్లను ఫ్రీజ్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఐదు నెలలు గడిచినా నేటి వరకు డబ్బులు విడుదల చేయక పోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల ఆర్థికాభివృద్ధి కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దళిత బంధు పథకం తీసుకువచ్చి నియోజకవర్గంలోని వేల కుటుంబాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు. దళిత బంధు లబ్ధిదారులు సుమారు ఐదు వేల మందికి పార్లమెంట్ ఎన్నికల తర్వాత రెండు విడుత డబ్బులు విడుదల చేస్తామని సీఎం జమ్మికుంట సభలో ప్రకటించాలని, లేనియెడల లబ్ధిదారులందరినీ ఏకం చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని బండ శ్రీనివాస్ హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు గడ్డివ్యాన్ దగ్ధం

వీణవంక, ఏప్రిల్ 29: బ్రాహ్మణపల్లి గ్రామంలో పశుగ్రాసాన్ని తీసుకువెళ్తున్న వ్యాన్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు, గ్రామస్తుల కథనం ప్రకారం.. చిట్యాల మండలానికి చెందిన రవి బ్రాహ్మణపల్లి గ్రామంలోని ఓ రైతుకు చెందిన పొలం నుంచి 190 గడ్డి కట్టలను సోమవారం డీసీఎం వ్యాన్‌లో వేసుకొని బయలుదేరాడు. గ్రామ శివారులో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు గడ్డి కట్టలకు తాకడంతో నిప్పంటుకుంది. ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ వారు వచ్చేసరికే గడ్డి కట్టలు పూర్తిగా కాలిపోగా, వ్యాన్ 70 శాతం దగ్ధమైంది. ఫైర్ ఇంజిన్ సిబ్బంది మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు.

'రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర'

చిగురుమామిడి, ఏప్రిల్ 29: భారతీయ జనతా పార్టీ దేశంలో మతం పేరిట రాజకీయం చేస్తూ రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర పన్నుతున్నదని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర పన్నుతున్న బీజేపీని ఎన్నికల్లో గెలువకుండా నిలువరించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వ పదేళ్ల పాలనలో నిత్యావసర సరుకుల ధరలతోపాటు నిరుద్యోగం పెరిగిపోయిందని విమర్శించారు. అనంతరం మండల కేంద్రంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యదర్శి ముఖ్య రాజు, టీజేఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి మోర గణేశ్, నాయకులు నీలవేణి రమేశ్, ములుగు సతీశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్, నాయకులు కవంపల్లి సంజీవ్, జిల్లెల్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

5లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 29: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజును మే 5 తేదీలోగా చెలించాలని ప్రాంతీయ అభ్యాసకుల సహాయ కేంద్రం సమన్వయ అధికారి డాక్టర్ ఆడెపు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. సైన్స్ కంప్యూటర్ విద్యార్థులు థియరీ పేపర్‌తో పాటు ప్రాక్టికల్ పరీక్ష ఫీజు కూడా చెల్లించాలని తెలిపారు. విద్యార్థులకు ఎస్సార్ కళాశాలలో మే 26 నుంచి జూన్ 1 తేదీవరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899

NT-311840-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

91827 77194

లెక్కింపు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

ఎన్నికల పరిశీలకుడితో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి

- ఈవీఎంలను పటిష్ట భద్రత మధ్య భద్రపర్చాలి
- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద తగిన సౌకర్యాలు కల్పించాలి
- ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా
- కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మోహంతితో కలిసి స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

కలెక్టరేట్, ఏప్రిల్ 29 : పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను భద్రపరచడంతో పాటు కౌంటింగ్ కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా సూచించారు. సోమవారం సాయంత్రం కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మోహంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ ముగిసిన తర్వాత తగిన భద్రత మధ్య ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ లకు తరలించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈ మేరకు అన్ని వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. దీంతో పాటు కౌంటింగ్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేపట్టాలని, కౌంటింగ్ సజావుగా సాగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్ఆర్ఆర్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో ఎన్నికలు ప్రశాంతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో పూర్తయ్యేలా పనిచేయాలని సూచించారు. ప్రతి రూమ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎక్కడా ఎలాంటి లోటుపాటు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, బాధ్యతాయుతంగా పనిచేస్తూ ముందుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తూ, పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలను పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని వివరించారు. ప్రత్యేక ప్రణాళికతో ఎన్నికలు విజయవంతం అయ్యేలా పని చేస్తున్నామన్నారు. సీపీ అభిషేక్ మోహంతి మాట్లాడుతూ, పోలీస్ శాఖ తరపున ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలీస్ శాఖ సిబ్బంది, అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో కే మహేశ్వర్, కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, ఎస్ఆర్ఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గడపగడపకూ బీఆర్ఎస్

- కేసీఆర్ చేపట్టిన పథకాలు వివరిస్తూ ఓట్ల అభ్యర్థన

గంగాధర: నారాయణపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సింగిల్ విండో చైర్మన్ బాలాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు

మానకొండూర్ రూరల్: కొండపల్కలలో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కార్పొరేషన్ / మానకొండూర్ రూరల్/ గంగాధర, ఏప్రిల్ 29 : ఎన్నికలు సమీపిస్తుండడంతో బీఆర్ఎస్ ప్రచారం జోరందుకున్నది. ఇందులో భాగంగా సోమవారం నగరంలోని 37వ డివిజన్‌లో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్‌లోని గడపగడపకూ వెళ్లి వినోద్‌కుమార్ ఎంపీగా చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. ఐదేళ్లలో బండి సంజయ్ ఎంపీగా నగరాభివృద్ధి నయా పైసా కూడా తీసుకురాలేదని విమర్శించారు. అభివృద్ధి కోసం తపించే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను ఈ సారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఆరె రవిగౌడ్, చంద్ర శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆదేశాల మేరకు పార్టీ గ్రామాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దపల్లి బ్రహ్మం, విజయ్ కుమార్, మహిళలు పాల్గొన్నారు. గంగాధర మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక బీఆర్ఎస్ నాయకులు గడపగడపకూ వెళ్లి కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధి చేసే బోయిన పల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

37వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

తరలివచ్చిన ప్రజలు

బీఆర్ఎస్ రోడ్‌షో సక్సెస్

హుజూరాబాద్, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ హుజూరాబాద్ మండలం కందుగుల, కనుకులగిద్ద గ్రామాల్లో సోమవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షో సక్సెస్ అయింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి వినోద్‌కుమార్ హాజరు కాగా, ఆయా గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి తమ మద్దతు ప్రకటించారు.

శాస్త్రీయ కళలతో వారసత్వ సంపద పరిపుష్టం

కళాకారులను సత్కరిస్తున్న వీనీ మల్లేశ్

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 27 : అతి పురాతనమైన భారతీయ శాస్త్రీయ కళలు మన వారసత్వ సంపదను పరిపుష్టం చేస్తున్నాయని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య సంకసాల మల్లేశ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా సోమవారం లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘ అధ్యక్షుడు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో ప్రొఫెసర్ మల్లేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాలలు, పాఠశాలల్లో ఆసక్తి కలిగిన పిల్లలు, యువతీయువకులకు మన శాస్త్రీయ కళలను నేర్పించడానికి సహాయం చేస్తానని వాగ్దానం చేశారు. అనంతరం నృత్య కళాకారులు రతన్ కుమార్, నంది పురస్కార గ్రహీత, గిన్నీస్ రికార్డు హోల్డర్, శాస్త్రీయ నృత్యకారిణి స్నేహలతను ఆచార్య మల్లేశ్, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, కళాభిమానులు పాల్గొన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

- ఇదీ గంగాధర వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో రైతుల పరిస్థితి

గంగాధర వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

గంగాధర, ఏప్రిల్ 29 : గంగాధర వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సిబ్బంది లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి మల్లేశానికి ఇక్కడ అదనపు బాధ్యతలు ఇవ్వడంతో ఆయన ఏ సమయంలో గంగాధర మార్కెట్‌కు వస్తారో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. అలాగే ఇక్కడ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న గంగాధర్ రెండు నెలలుగా మార్కెట్‌కు రావడం లేదు. తనకు రెండు నెలలుగా వేతనం రాకపోవడంతో విధులకు రావడం లేదని తెలిసింది. అలాగే ఇక్కడి కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్ గంగాధరలో కాకుండా చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ముగ్గురు సెక్యూరిటీ గార్డులు ఉండగా, కిషన్ అనే వ్యక్తి చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తుండగా, మరో ఇద్దరు మల్లేశం, రఫీ మాత్రమే మార్కెట్‌లో విధుల్లో ఉన్నారు. అసలే వరి ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న సమయం కావడంతో మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏదైనా సమస్య వస్తే చెప్పడానికి అధికారులు ఎవరూ అందుబాటులో ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గంగాధర మార్కెట్ కమిటీకి పర్మినెంట్ కార్యదర్శిని ఏర్పాటు చేయాలని, ఇతర సిబ్బంది విధులకు హాజరై యేలా చూడాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రామడుగు(చొప్పదండి), ఏప్రిల్ 29: మండలంలోని వెలిచాల గ్రామంలో మామిండ్ల కొండయ్య, లంక ఎల్లయ్య, దొంతరవేని నర్సవ్వ ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా, సోమవారం వారి కుటుంబ సభ్యులను రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు పరామర్శించారు. సానుభూతిని వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ నాయకుడికి..

చిగురుమామిడి, ఏప్రిల్ 29: నవాబుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మద్దెల రమేశ్ తండ్రి కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని పార్టీ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య సోమవారం స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. కొమురయ్య మృతికి కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు పిల్లి వేణు, నాయకులు దొనపాటి కృష్ణారెడ్డి, ఎడెల్లి మల్లయ్య, వరుకోలు వెంకటయ్య, బొల్లి రవీందర్, దురిశెట్టి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

సైదాపూర్, ఏప్రిల్ 29: మండల సర్వసభ్య సమావేశం సోమవారం కోరం లేక వాయిదా పడింది. మే1 తేదీన తిరిగి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీపీ సారబుద్ల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

పెద్దమ్మ పట్నాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

చొప్పదండి, ఏప్రిల్ 29: మండల కేంద్రంలోని ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి పట్నాల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కులసంఘాల ఆధ్వర్యంలో జరుపుకొంటున్న ఈ పండుగ ఐక్యత, భక్తి భావాన్ని చాటుతున్నదన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నేతలు, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

చొప్పదండిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

నేడు 'పది' ఫలితాలు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 29 : పదో తరగతి ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో ఫలితాలను వెల్లడించనున్నారు. కాగా, పరీక్ష ఫలితాలు వచ్చిన తర్వాత విద్యార్థులు మానసిక ఆందోళనకు గురికావద్దని, మనో ధైర్యంతో ఫలితాలు ఎలా వచ్చినా స్వీకరించేలా ఉండాలని అసోసియేషన్ ఆఫ్ రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఈ మేరకు మానసికంగా ఆందోళనగా ఉన్న విద్యార్థుల కోసం ఉచిత ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు 97039 35321 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

కష్టపడితే జీవితంలో పైకి రావచ్చు

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్

కలెక్టరేట్, ఏప్రిల్ 29 : చిరుప్రాయం నుంచే కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థితికి రావచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ తెలిపారు. సోమవారం నగరంలోని స్వధార్ హోమ్, బాలసదన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్వధార్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడుతూ, జీవితంలో ఎలాంటి తప్పుడు పనులు చేయకూడదని ఉద్బోధించారు. బాలసదన్‌లోని పిల్లలతో మాట్లాడుతూ, బాల్యం నుంచే మంచి నడవడిక నేర్చుకోవాలన్నారు. అలాగే, ప్రభుత్వ వృద్ధుల, దివ్యాంగుల ఆశ్రమాన్ని తనిఖీ చేశారు. ఆయాచోట్ల వంటగదులు పరిశీలించి, వంట, ఆహార పదార్థాలు నిల్వ చేసే ప్రాంతాలు తనిఖీ చేశారు. ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఎదురైనా తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్‌సెల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, వృద్ధాశ్రమ, స్వధార్ హోం, బాలసదన్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'బీజేపీకి ఓటు.. రాజ్యాంగానికి చేటు'

తిమ్మాపూర్, ఏప్రిల్ 29: బీజేపీకి ఓటు వేస్తే రాజ్యాంగం సంక్షోభంలో పడుతుందని దళిత నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు రెడ్డిగాని రాజు ఆధ్వర్యంలో దళిత సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ఏం అభివృద్ధి చేసిందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మళ్లీ ఓట్లను ఎలా అడుగుతారని నిలదీశారు. ఎక్కడో అట్టడుగున ఉన్న దళితులను అభివృద్ధి చేసిన రాజ్యాంగాన్ని మనం కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు రెడ్డిగాని రాజు, జిల్లా అధికార ప్రతినిధి ఎల్కపెల్లి సంపత్, మామిడి అనిల్ కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ అలువాల కోటి, పొన్నాల చిరంజీవి, శంకర్, లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో రవీందర్

గంగాధర, ఏప్రిల్ 29: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డీపీవో రవీందర్ ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ, సమస్యలు ఉంటే పైఅధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే ఉపాధి హామీ పనులు, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి సూచనలు చేశారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీధర్, డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవోలు రాము, రాజేశ్వరి, ఎంపీవోలు జనార్దన్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ పేరుతో కాంగ్రెస్ మోసం'

తెలంగాణచౌక్, ఏప్రిల్ 29: ఎస్సీ వర్గీకరణ పేరుతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని మాదిగలను మోసం చేస్తున్నదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ ఆరోపించారు. నగరంలోని ప్రెస్ భవనంలో రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.2004 నుంచి 2014 వరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎస్సీ వర్గీకరణ గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకర